
# రాళ్ళ

పులికంటి కృష్ణారెడ్డి



**పూరి** ముందర చెరువు కట్ట మీద నడుస్తున్నాడు నర్సిమ్ములు!

ఏపియాడ్‌లో ఎవరి కాలి తన్నో తిని పైకెగిరి కింద పడుతున్న బంతిలా సూర్యుడు పడమటి దిక్కుకు ఒరిగిపోతున్నాడు. బండ్లకొద్దీ ఎర్ర మట్టిని కుమ్మరిస్తే దుమ్ము దట్టంగా పైకి లేచినట్లుంది పడమటి దిక్కు.

చెరువులో కొత్త నీళ్ళు తన్నులు తిన్న సూర్యుడి ఒంటి మీద నుండి కారిన నెత్తురు లాగా చిక్కగా ఉన్నాయి.

చెరువు కింద పంట చేలు కన్నుల పండువుగా ఉన్నాయి. ఆ పంట చేల మీద ఎగురుతున్న గువ్వలు కలిగినవాడి గుండెలో నుండి ఎగురుతున్న చిలిపి కోర్కెల రవ్వలు! తరుమడానికి విసురుతున్న వడిశెల రాళ్ళు కలిగినవాడి కోర్కెల ముందు పేదోళ్ళ నిట్టూర్పుల ముళ్ళు!


కడుపు నిండితే కైలాసం.

అడవికి మేతకు వెళ్ళిన ఆలమందల్లో కోడె దూడలు మోర వంచి తోకలు పైకి లేపి వూరివైపు పరుగులు తీస్తున్నాయి.

నర్సిమ్ములు చెరువు కట్ట మీద నడుస్తున్నాడు.

హుందాగా వూరివైపు నడుస్తున్నాడు.

నడుస్తున్న నర్సిమ్ములు ఉన్నట్లుండి ఎవడో జబ్బ పట్టి నిలబెట్టేసినట్లుగా నిలబడిపోయాడు. ఎదురైన ఆకృతిని చూసి ఒక్క క్షణం అదిరి పడినాడు.



కుడి చేతిలో వచ్చు కత్తి. . .ఎడమ చేతిలో తల. . .పూనకం వచ్చినట్లు మనిషి వెనక్కు ముందుకు వూగుతున్నాడు. వూగుతూ నడుస్తున్నాడు. కట్టుకున్న బట్టలన్నీ నెత్తురోడుస్తూ కంపరం పుట్టిస్తున్నాయి. తెగిన తల నుండి ప్రవాహ వేగంతో చిమ్మిన రక్తం ఇప్పుడు బొట్లు బొట్లుగా రూపాంతరం చెంది పడుతూ ఉంది. చూపుల్లో ఆవేశం. . .నడకలో వేగం—ఇంకొక్క మనిషి ఎదుట పడితే ఏమవుతుందో పరిస్థితి అన్న సందేహం?

అయినా—నిలదొక్కుకుని నిలబడినాడు నర్సిమ్ములు.

ఆశ్చర్యం!—ఆ రూపం తనదే!

అయితే ఇప్పటిది కాదు. ఏడేండ్లనాటిది.

సన్నగా నవ్వుకొన్నాడు నర్సిమ్ములు. ఆ నవ్వులో ఎన్ని అర్థాలో?—నవ్వుతూ దృష్టిని కొత్తనీళ్ళలో కొట్టుమిట్టాడుతున్న చెరువు వైపు మళ్ళించాడు.

అతని గుండె బాధగా మూలిగింది.

ఆ నీటి అలల మీద తేలియాడుతున్న స్త్రీ ఆకారం— తుమ్మెద రెక్కల్లా మెరుస్తున్న చారడేసి కురులు—గోధుమ రంగు కాన్వాసు మీద ముదురు నలుపు రంగులో ముంచి తీసిన కుంచె విన్యాసాన్ని తలపింపచేస్తున్నాయి. చారడేసి కండ్లు ఆ చెరువులో పూసిన కలువరేకులా అనిపిస్తున్నాయి. ఏరి కోరి పోత పోసినట్లున్న ఎత్తువల్లాలు నీటి అలలతో పోటీ పడుతున్నాయి.

ఆ కుందనపు బొమ్మ కోసం ఇరుసు విరిగిన బండిలా ఆ కట్ట మీద కుప్పగా కూలిపోయాడు నర్సిమ్ములు!

ఇప్పుడు కాదు—ఏడేండ్లనాడు!

ఆ తలంపు ఇప్పుడు తపింపచేస్తే చెరువు కట్ట మీద ఒక చెట్టు మరుగులో కూర్చున్నాడు. ఏకదీక్షగా చెరువు వైపే చూస్తున్నాడు. పొద్దు గూట్లో పడింది. తాగినవాడి మత్తులాగా క్రమేణా చీకటి కోపెక్కుతూ ఉంది. నర్సిమ్ముల ఆలోచనలు నీటి అలల్లాగా ఒకదాని వెనుక ఒకటిగా వెనక్కు వెళ్ళుతున్నాయి. వెళ్ళి వెళ్ళి ఏడేండ్ల వెనుక నిలబడినాయి!. . .

అది ఒక పల్లె.

'మట్టి పిసికితేనే ముద్ద సంకటి. నదువు సందెలొస్తే ఏమన్నా సంగటికొస్తుందా? నదివి నదివి రాజ్యం లేలబొయ్యే దేవుడు?' అని తాతముత్తాతల కాలం నుండి తలపోస్తానే ఉందా పల్లె. అందుకే పట్టుబట్టి పాత తరంవాళ్ళు గుడి కట్టించుకొన్నారే కాని బడి పెట్టించుకోలేదు.

ఆ గుడిలో దేవుడుండాడు!

ఆ దేవుణ్ణి ఆ వూరి రెడ్డిగారు పూజిస్తుంటారు.

వూళ్ళోవాళ్ళందరూ కలిసి రెడ్డిగారిని పూజిస్తుంటారు.

ఏడాది కొకసారి ఏదో ఉత్సవం పేర రెడ్డిగారు దేవుణ్ణి పూజిస్తుంటారు.

వూళ్ళోవాళ్ళు దినము రెడ్డిగారిని పూజిస్తుంటారు.

తాత ముత్తాతల కాలం నుండి దేవుడికి పూజా పునస్కారాదులు జరుగుతున్నా ఆ దేవు డెప్పుడైనా ఎవరికైనా కాసంత సహాయం చేసినట్లు దాఖలాలు లేవు. కానీ, వూళ్ళోవాళ్ళ పూజ లందుకొంటున్న రెడ్డిగారు మాత్రం పెండ్లి పేరంటాలకు కావచ్చు చావులు నమర్తలకు కావచ్చు ఎరువు లెంపలు కొనడానికి కావచ్చు అడిగితే అడ్డం చెప్పిన పాపాన పోలేదు. రెడ్డిగారు ఇస్తానే ఉండారు. వూళ్ళోవాళ్ళు రెడ్డిగారిచ్చిన దానికి నిదర్శనంగా తాము తీసుకొన్న దానికి గుర్తుగా వేలి ముద్రలు వేస్తానే ఉన్నారు.

ఆ పల్లెకు పరుగు దూరంలో మరొక్క పల్లె. ఆ పల్లెలో కరణం. ఆ కరణానికి రెడ్డిగారంటే ప్రాణం. రెడ్డిగారికి కరణమంటే వల్లమాలిన అభిమానం. ఎందుకంటే—కరణం ఆ పాయకట్టు లెక్కలు చూస్తూ ఉంటాడు. రెడ్డిగారి లెక్కలు సరి చేస్తూ ఉంటాడు.

రెడ్డిగారికి ఒక కొడుకున్నాడు. కరణంగారికీ ఒక కొడుకున్నాడు. ఆ కొడుకులు ఇద్దరూ పట్నంలో పై చదువులు చదువుతున్నారు. ఆ పాయకట్టు కంతటికీ చదువుకొంటున్నది వాళ్ళిద్దరే!

ఆ వూళ్ళో మిద్దెలున్నాయి. బిళ్ళ ఇండ్లున్నాయి. మూడంకణాల పూరిండ్లు ఉన్నాయి. చాట్టు గుడిసె లున్నాయి. అన్నింటిలోనూ మనుష్యులే నివసిస్తున్నారు! నివసించేది మనుష్యులే అయినా నివసించే విధానంలో ఎంతో వైరుధ్యం!

కొందరికి కడుపులో చల్ల కదలదు!

కొందరికి రెక్కాడితేగాని డొక్కాడదు.

కొందరు ఎండ మొగం ఎరుగరు.

కొందరు ఎండవానల్ని వదలి కదలరు.

ఎందుకీ వ్యత్యాసాలని వాళ్ళెప్పుడూ ఆలోచించ లేదు. ఆలోచించే అవకాశమూ లేదు. కర్మకొద్దీ బతుకులని వాళ్ళ నమ్మకం. నమ్మకంలో తృప్తి ఉంది. తృప్తి మనిషిని ముందుకు పోకుండా నిరోధిస్తుంది. అలా బతుకులు వాళ్ళో చేగమనాయు డొకడు. నాయుడుగారికి అంతో ఇంతో కయ్యాగాలా ఉంది. చేను చెలకా ఉంది. అలాగోడికున్న కయ్యి కాలవ మీద, చేను చెట్టు మీద ఎవరికీ కన్ను లేదు కానీ, నాయుడు కూతురు రంగమ్మంటే మాత్రం ఆ వూళ్ళో కుర్రకారు కంతా కన్ను.

రంగమ్మ ముద్దుల పేరు రంగి!


రంగి—అంటే ఆ వూరికే రంగు.

రుసరుసలాడే వయసు. . .మిసమిసలాడే సొగసు ఒళ్ళంతా ఒంపు సొంపుల ఒయ్యారాలు—బుట్ట చంకనబెట్టి చెక్కుడు పార భుజానికి తగిలించుకొని రెట్లాను గనిమ మీద పొట్లగిత్తలా నడుస్తూంటే—చూడ్డానికి కండ్లు చాలవు.

అందుకే ఆ వూళ్ళో కుర్రకారుకంతా రంగి మాట చెవిని పడితే చాలు—గుండెల్లో అదోకరక మైన పొంగు! రంగి మాత్రం నర్సిమ్ములంటే గుటకలు మింగు!

ఆ వూళ్ళో నారాయణరెడ్డి కొడుకు నర్సిమ్ములు రంగి మాటెత్తితే రంగే మారిపోతాడు. రెడ్డోరికి నాయుడోళ్ళది కయ్య పక్కన కయ్య. ఆ కయ్యలో కసువు చెక్కుకొంటూ రంగి కంట పడితే చాలు. . .నర్సిమ్ములు పాటందుకొంటాడు.

పార కసువు సెక్కుతూంటే
సీర మోకాళ్ళపంబునా




సిగ్గు బొరువు ఒలకబోస్తూంటే—
నడుము తాళంవేస్తుండాదే
పడుసు పిల్లా
నీ సిగను పూలు నవ్వుతుండాయి
ఎదను కంపు నిండుతుండాది!—అని.

నర్సిమ్ములంటే రంగి పడి చస్తుంది. క్షణం కంట పడకపోతే విలవిల్లాడిపోతుంది.

సెట్టడుగులుంటది
పుట్టడుగుతుండాది
సేనిలో అలసంద
పువ్వడుగుతుండాది
బదులేమిసెప్పేది మావా!
ఈ బతుకెట్ల బతికేది మావా!

—అని వలవలా కన్నీళ్ళు కారుస్తూ వలవలా ఏడుస్తుంది. వేళాపాళా లేకుండా తిరిగిన పుట్టను గుట్టను చెట్టును చేనును నిలదీసి అడుగుతుంది 'ఎక్కడనా మావని' అని.

వాళ్ళిద్దరి మనసులు పాలునీళ్ళలా కల గలసినాయి భవిష్యత్తును గురించి కలలు కంటున్నాయి.

ఈడూ జోడూ చూసి కూలి కాడవరి చేతి కిమ్మన్నారు పెద్దోళ్ళు. ఇవ్వచ్చు. వాళ్ళ మాటల్లో ఏమాత్రం సత్యమున్నా, నిరభ్యంతరంగా కూలి కొడవళ్ళు చేతికివ్వచ్చు. అయితే మూఢత్వం ముసురుకొన్న ఆ పల్లెలో కులాల అడ్డు గోడల్ని కూలదోసేదెవరు?

చెంగమ నాయుడుకున్నంత కయ్యా గొలవ, చేనా చెట్టూ నారాయణరెడ్డికీ ఉంది. నారాయణ రెడ్డికున్నంత ఇరువు చెంగమనాయుడికీ ఉంది వియ్యానికైనా కయ్యానికైనా కావలసింది సమత్వం. అది ఆ ఇద్దరిలోనూ ఉంది. అయితే కులాల మాట?

వాళ్ళిద్దరు ఒకరి కండ్లలో ఒకరు కాపురం పెట్టుకొన్నారు.

పెద్దోళ్ళ కండ్లలో కారం కొట్టినట్లయింది రంగమ్మను కడపదాటి కాలు బయటపెట్టొద్దని కట్టడి చేసినాడు చెంగమనాయుడు.

నాలుగు గోడల మధ్య నలిగిపోతా ఉంది రంగి నిలబడిన చోట నిలబడ లేకుండా, కూర్చున్న చోట కూర్చో లేకుండా కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు నర్సిమ్ములు.

ముద్దొచ్చే మేక పిల్లలా, పొలాల మీద పడి ఎగురుతూ దుముకుతూ, గనిమల మీద పడతా లేస్తా నడుస్తూ, నవ్వుతూ నవ్విస్తూ, నవ్వుతూ నవ్విస్తూ ఆనందంమే రూపు దాల్చినట్లుగా తన వెంట పడే రంగిని నాలుగ్గోడల మధ్య వూహించుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు నర్సిమ్ములు.

ఏ చెట్టు నీడనో, గుట్ట మీదనో కూర్చుని తనకోసం కుమిలి కుమిలి ఏడుస్తుంటాడేమో తన మావ! అని నర్సిమ్ముల్ని తలంచుకొని తపించి పోతూ ఉంది రంగి. ఆ తపనతో తల బాదుకొంటూ ఉంది రంగి!

నిజాయితీ కలిగిన ప్రేమ నిప్పులాంటిది! అది మండి ఎలాంటి గుండెను మండిస్తుంది. నర్సిమ్ములు ఆ గుండె మంటల్ని తట్టుకోలేకపోతున్నాడు. ఎట్ల చెయ్యాల? ఏం చెయ్యాల? అని ఆలోచిస్తున్నాడు.

"అవును. రంగిని లేవదీసుకుని ఎక్కడికైనా వెళ్ళిపోతే!"

వెళ్ళిపోతే ఏమవుతుంది? ఏమవుతుంది? గట్టిగా రెక్కలున్నాయి. రెక్కాడితే డొక్కాడకుండా పోదు.

ఎంతో ధైర్యం వచ్చింది నర్సిమ్ములికి ఆ ఆలోచనతో!

'అయితే ఈ సంగతి రంగికి తెలిసేదెట్లా? ఎవరితో చెప్పాల? ఎట్లా చెప్పాల?

పోనీ! ఒక చీటీ రాసి పంపిస్తే? అయ్యో! రావా చదవే లేకపోతే ఇక చీటెట్ల రాయల్లా? అదే నాలుగక్షరాలు నేర్చుకొనుంటే ఒక చీటీ రాసి పంపి ఉండవచ్చు కదా?—అట్లకునేకొద్దీ అతని మనస్సు చాలా బాధ పడింది. చదువుకోలేక పోయినందుకు కాసేపు బాధ పడినాడు. తన అశక్తతను తలుచుకొని ఏడ్చినాడు. ఎంత బాధపడినా మరెంత ఏడ్చినా, చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొన్నట్టుంటుందని అట్లా ఇట్లా చూసి కరణం కొడుకు కాళ్ళే పట్టుకున్నాడు.

నర్సిమ్ములంతటివాడే కాళ్ళ మీద పడేసరికి కరణం కొడుకు కరిగి నీరయిపోయాడు. భుజాలు పట్టి ఆప్యాయంగా పైకి లేపుతూ, 'ఏం జరిగిందో నర్సిమ్ములూ?'' అంటూ అనునయంగా అడిగినాడు.

''కర్నమయ్యా! కర్నమయ్యా !! నువ్వే జెప్పు, కర్నమయ్యా ! మనం బుట్టాక కులం బుట్టిందా? కులం బుట్టాక మనం బుట్టామా? రంగి న్నేను పెండ్లి జేసుకుంటే ఈళ్ళ కెందు కిట్లా కండ్లబ్బి పోతాఉండాయే? నేనేమన్నా ఒకరి కంచంలో కూడు పెరుక్కుంటా ఉండానా? ఇంకొకరి మంచంలో పోటు కోర్తా ఉండానా? లే దెవురి కొంపలయినా కూలస్తా ఉండానా? నా రంగిని కడప దాట్నీకుండా కట్టుబాటు జేసినారే? ఇదేమన్నా నాయంగా ఉండ దంటావా?''

''న్యాయమని నేను మాత్రం ఎట్లా చెబుతాను, నర్సిమ్ములూ!''

''అందుకే నా రంగిన్దీసుకొని నే నీ వూరొదిలి పోతా. యాణ్ణో ఒకసోట కూలీ నాలీ జేసి బతుక్కుంటా!''

''సెభాస్! మొగోడంటే నువ్వే, నర్సిమ్ములూ! అమాదిర తెగిస్తేనే కానీ, ఈ పెద్దోళ్ళకు బుద్ధి రాదు. పో! నీ ఇష్టమొచ్చినచోటికి పో! కష్టపడే వాడికి ఎక్కడా కూడే! అయితే నన్నిప్పు డేం చెయ్య మంటావ్?''

''అంతమాటన్నావు సాలు, కర్నమయ్యా! నచ్చి నీ కడుపున పుడ్తాను. ఏమీలే! ఒక్క సీటిత్రా సియ్యి. రేపు రేత్రికి నా రంగిని సెరువు కట్ట కింద సింతమానికాడికి రమ్మని. ఎవుర్నైతన్నా ఇచ్చి పంపించుకుంటా!''


కరణం కొడు కాసంతసేపు ఆలోచించినాడు. ఆలోచిస్తూ తల ఆడించినాడు. ఆ తలాడింపులో ఎన్ని తలంపులో ఏమో? ఏమాత్రం తామసించ కుండా పరపరా నాలుగు అక్షరాలు రాసిచ్చినాడు కరణం కొడుకు.

చీటిని చేతి కందుకొని పరుగందుకొన్నాడు నర్సిమ్ములు.

పక్కింటి పిల్లోడు భయం భయంగా అందించిన చీటిని రంగి చేతి కందుకొనింది.

అది మావు రాసిన చీటి అనుకొనేకుండికి దాని మనస్సు రంగుల రాట్నమే అయింది !

సీటి సేతికందుకోని
సిగ్గుపడిపొయ్యిందీ
కండ్ల కద్ది గుండెకద్ది
కడకు ముద్దు పెట్టుకున్నేందీ !
ఎన్నవంటే మణుసూ
ఏమి రాసిందోని
కన్నెపిల్లా మణుసూ
ఎన్నెలే అయ్యిందీ!
ఎన్నెలైనా మణుసూ
ఎక్కెట్టా పొయ్యిందీ
మావ సీటి సదవలేక
మగ్గి మగ్గి ఏడ్చిందీ!
అట్టు తిరిగి ఇట్టు తిరిగి
తలగొట్టుకున్నేందీ
సదువుకోక పొయ్యినందుకూ
సచ్చి దుగ్గడయ్యిందీ!




ఏమి చెయ్యాల్నో తోచకుండా రంగి ఇంట్లోకి పెళ్లోకి, పెళ్లోకి ఇంట్లోకి తిరిగింది. కాసేపు కళ్ళ నీళ్ళు పెట్టుకొనింది. మరి కాసేపు తన చేత కానితనానికి చిటపట లాడింది. ఆ తరువాత తన్ను తాను సమాళించుకొని పైకి లేచింది. ఆ ఇంటా ఈ ఇంటా పాచిపనులు చేసి బతుక్కునే చెంగమ్మవ్వ చేతులు పట్టుకొనింది. పట్టుకొన్న చేతుల్లో ఆమెకు తెలియకుండానే అయిదు రూపాయల నోటు పెట్టింది. అమీదట చీటి చేతిలో పెట్టింది.

"చెంగమ్మవ్వా! చెంగమ్మవ్వా!! నీకు సేతు లెత్తి మొక్కతాను. ఈ సీటట్టా రెడ్డి కొడుకు దగ్గిర సదివించుకో(రా)వా!" కన్నీళ్ళు చెంపల మీద జాలువారుతూంటే పట్టిన చేతుల్ని వదల కుండా ప్రాధేయపడింది రంగి.

చెంగమ్మవ్వ అక్కడున్నట్టే తిరుక్కొని వచ్చింది.

అట్నా ఇట్నా చూసింది. ఎవ్వరూ కంట పడక పొయ్యేసరికి తొందరపడుతుంచుకొనింది. రెడ్డి కొడుకు చెప్పిన మాటే రంగితో చెప్పింది.

రంగిని పట్టేదానికి పగ్గాల్లేవు!

మనసిచ్చినవాడే మనసిస్తే మగువ తెగింపుకు అవధులుండవు. ఆ ఆనందానికి హద్దులుండవు. క్షణ మొక యుగంగా మరునటినాటి రాత్రికోసం తహతహ పడుతూ ఎదురు చూస్తూ ఉంది.

కాలం ఆగదు. కొందరికి భారంగా, కొందరికి కారంగా, కొందరికి హాయిగా జరిగిపోతూనే ఉంటుంది. అది దాని నైజం.

ఆ మరువటి రోజు రాత్రి వూరు మాటు ఘణిగింది. ఇంట్లో అందరూ మంచి నిద్రలో ఉన్నారు. రంగి నగానట్రా సర్దుకొనింది. ఉన్న చీరెల్ని, రవికెల్ని ఒక సంచి నిండుకు కుక్కుకొనింది. బుడిగ హుండీలో దాచుకొన్న డబ్బును సంచిలో భద్ర పరుచుకొనింది. ఇంటినుండి బయలు దేరింది. బయలుదేరుతూంటే ఏదో బాధ—మరేదో మమకారం గుండెని పీకుతున్నాయి. 'కని పెంచిన వాళ్ళనే కాదని పోతున్నావే?' అని ఎవరో నిలదీసి అడుగుతున్నట్లుంది. ముందుకు పోలేక, వెనక్కు రాలేక కాసేపు కొట్టు మిట్టాడింది. గుండెదిటవు చేసుకుని ముందు కడుపుతీపి పీకిపోయింది. పుట్టినింటితో బంధాల్ని తెంచుకొని రంగి కాలు బయటపెట్టింది.

కన్ను పొడుచుకున్నా కనుపించని చీకటి. అడుగు తీసి అడుగు పెట్టాలంటే కాళ్ళు అదురుతున్నాయి, ఆ అలికిడికి మేల్కొన్న వీధి కుక్కలు కొంపలు మునిగినట్లు అరుస్తూ వెంటబడి, అంతలోనే తోకాడిస్తూ నోళ్ళు మూసుకొన్నాయి. బహుశా అవి కూడా రంగిని గుర్తించినాయేమో? 'బ్రతుకు జీవుడా!' అని బెదురు జింకలాగా దిక్కులు చూస్తూ ఆమె నడుస్తూ ఉంది. చెంగమ్మ చెప్పిన విషను బావి దరిదాపులకు చేరేటప్పటికి ఆ చీకటిలో ఒక మానవాకృతి మసక మసకగ్గా కనిపిస్తూ ఉంది. ఎక్కడలేని తెంపు వచ్చింది రంగికి. ఒక్క వూవున పొయ్యి ఆ ఆకారాన్ని చుట్టేసింది.

రెండు చేతులు రంగిని బలంగా గుండె కదుముకొన్నాయి !

తడబాటులో గుండె దడ తీర్చుకొందామని రంగి ఆ గుండెమీద ఒక్క క్షణమంటే ఒక్కటే క్షణం వాలిందో లేదో ఆ గుండె తనది కాదని తెలిపోయింది. ఎగచూసి ఎగిరిపడింది.

పకపకా నవ్వుతూ ఉండాడు రెడ్డి కొడుకు!

● ● ●

"నా కంతా తెలుసులేయే రంగీ! చదువూ సంధ్యలు లేని చవటతో లేచిపోతే వాడేం ఉద్యోగాలు చెయ్యబోతాడా? నిన్ను ఉయ్యాల్లో పెట్టి వూపబోతాడా? కాకుంటే రిక్షా తొక్కబోతాడు. నిన్నొక గుడిసింట్లో పెట్టబోతాడు. అంతకు మించి ఏం చెయ్యబోతాడు? ఉడికిన పొట్ట పేగు తెంచలేని వెధవ కోసం ఎందుకే ఈ ఉబలాట? నా మాటిను రంగీ!"

నోట్లో మాట నోట్లో ఉండగానే చెంప 'ఛెళ్ళు' మనింది.

రెడ్డి కొడుకు రెచ్చి పోయినాడు. పొగరుబోతు అంబోతులా పైబడినాడు.

వూరి ముందర చెరువులో ఎండ్రకాయల కోసం వచ్చిన గుంతనక్కలు వికృతంగా అరుస్తున్నాయి. పొలాల మీద మిణుగురు పురుగులు చీకటిని చీల్చ డానికి వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాయి.

చెరువు కింద చింతచెట్టు దగ్గర గుండె చేత పట్టుకుని ఎదురు చూస్తున్నాడు నర్సిమ్ములు.

పెనుగులాడి పెనుగులాడి చేతకాకుండా రంగి సొమ్మసిన్ని పడిపోయింది!

ఆకలి గొన్న కుక్క సంకటి కుండమీద పడినట్లు దొంగ గొడ్డు చేను మేసినట్లు రెడ్డి కొడుకు స్పృహ లేని ఒంటిమీద పడి కక్కుర్తి తీర్చుకుని కొండను పిండి చేసినంత ధీమాగా కదిలి పోయినాడు.

'రంగికి సీటే అందిందో లేదో? అందుంటే ఎందుకు రాలేదబ్బా? అసలొస్తుందో? రాదో?' అని తహతహ లాడుతూ వూరి వైపు కండ్లు చించుకుని చూస్తున్నాడు నర్సిమ్ములు. ఆకు అల్లాడితే చాలు! ఆమేనేమో అని అదిరిపడి ఆశగా చూస్తున్నాడు. దాదాపు తెల్లవారుజాము వరకు ఎదురు చూసి ఎదురుచూసి ఇక రాదని నిర్ధారించుకుని ఇంటి ముఖం పట్టినాడు. పడక మీద వాలినాడే కాని పడకపొందుంటే ఒట్టు!

కాలం ఒళ్ళు విరుచుకుంటూ బద్ధకంగా కదులుతు ఉంది.

రంగిలో కాస్త కదలిక కనుపించింది.
'సొమ్మసిల్లి పడున్న రంగీ
సిన్నంగా లేసి కూసుందీ
సీగిట్లో తడిని తడిని
సీర సేతి కందుకున్నేందీ!
పొరాడి తారాడి
రైక సేతి కందుకున్నేందీ
పేలికలైన రైకను జూసి
పొల్లి పొల్లి ఏడ్చిందీ!
సీర సినిగె రైక సినిగె
సీగిట్లో బతుకే సినిగె
మణుసు సిన్నిగె నుదుత సినిగె
మావ తలరాత సినిగె
ఎలుగు మొకవు సూడలేకా
ఎవురి ఎదుట పడలేకా
మైల పడిన పాడు ఒంటితో
మావకాడ సేరలేకా
సిన్నదాని కమ్మని బతుకూ
సెరువు లోన తేలిపోయె!'
తెల్లవారింది!

చెరువులో తేలియాడుతున్న రంగి శవాన్ని చూసి వూరు తెల్లపొయ్యింది!

రెండు బార్ల పొద్దెక్కింది. అప్పుడు నిద్ర లేచినాడు నర్సిమ్ములు. రాత్రంతా నిలువుగాళ్ళమీద నిలబడి ఎదురు చూచినాడు గదా పాపం! బాగా

అలిసిపోయినట్లుంది. ఏ తెల్లవారుజామున పట్టిందో నిద్ర! లేచి చూసేటప్పటికి రెండు బార్ల పొద్దెక్కింది. లేస్తూనే చెవిని పడిన వార్త 'రంగి చెరువులో దూకి చచ్చిపోయ్యిం' దని.

ఆ మాట చెవిని పడుతూనే 'రంగీ!' అని ఒక్క అరుపు అరిచినాడు. అది అరుపు కాదు. కారుమేఘాల సందుల్లో మిరుమిట్లు గొలిపే మెరుపు! ఆ మెరుపు ధాటికి ఇంట్లో వాళ్ళు దిగ్భ్రాంతి చెంది ఎక్కడి వాళ్ళక్కడ నిలువురాళ్ళలా నిలబడి పోయినారు. నర్సిమ్ములు 'రంగీ! అయ్యో నా రంగీ!' అని అరుస్తూ చెరువు కట్ట వైపు పరుగెత్తుతున్నాడు. ఒంటి మీద బట్ట జారి పొయ్యేదికూడా తెలియకుండా పరుగెత్తుతున్నాడు. పిచ్చిగా పరుగెత్తుతున్నాడు. కంటి కొద్దీ ఏడుస్తూ నోటి కొద్దీ అరుస్తూ కాలికొద్దీ పరుగెత్తుతున్నాడు. పరుగెత్తి పరుగెత్తి చెరువు కట్టమీద నిలబడినాడు. చెరువంతా కలయ చూసినాడు. బో''మని ఏడుస్తూ కుప్పగా కూలిపోయినాడు. అంతలోనే ఎగిరిపడి లేచి చెరువులో దూకబోయినాడు.

అడుగు ముందుకు పడకుండా ఎవరో గట్టిగా పట్టుకున్నారు. పట్టుకుంటే ఆగే తీరా అది? విదిలించి కొట్టినాడు. అయినా పట్టుకున్న మనిషి కూడా సామాన్యుడేం కాదు. పట్టిన పట్టు వదల కుండా నిలబెట్టి 'ఏమిటి పిచ్చి?' అని అడిగినాడు.

''నా రంగి! అయ్యో నా రంగి!'' అని బావురు మంటూ నర్సిమ్ములు విదిలించి కొట్టినతన్నే కారచు కున్నాడు.

''ఏ రంగి ఇంకా ఇక్కడెక్కడుంది? చెంగమునాయుడిల్లు చేరింది!''

నర్సిమ్ములు గిరుక్కున వెనక్కు తిరిగినాడు. మళ్ళీ పరుగందుకున్నాడు.

చెంగమునాయుడు ఇంటి ముందర తిన్నెలమీద వాకిట్లో ఎక్కడ చూసినా జనసందోహమే! కొందరు వంచిన తల ఎత్తకుండా యోచిస్తున్నారు. కొందరు కన్నీళ్ళు దాచుకోవడానికి తలలు వంచుకున్నారు. పూళ్ళో ఆడవాళ్ళు ఒక్క ప్రవాహంలాగా ఇంట్లోకి జొరబడుతున్నారు. మళ్ళీ కాసేపటికి నోట్లో గుడ్డలు కుక్కుకుని కుములుతూ బయట పడుతున్నారు. ఏడుస్తున్న వాళ్ళను చూసి మరి కొందరు ఏడుస్తున్నారు. చెంగమునాయుడి ఇల్లూ వాకిలీ కన్నీటితో తడిసి ముద్దయింది.

వచ్చే వాళ్ళను పొయ్యే వాళ్ళను చూస్తూ చెంగమునాయుడు గుండె బాదుకుంటూ ఏడుస్తున్నాడు. నర్సిమ్ములు కంట పడీపడడంతోటే ''ఈడి కెందు కొచ్చినావురా ఈడిబోగలాడా! ఇంకా ఎవుర్నిసంపాలను కుని వచ్చినావురా ఇసిరి ముండాకొడకా! బంగారట్టా బిడ్డను ని నోట్లో పెట్టుకుంటివి కదరా! నా కడుపు మంటసీ కెదిగా! పోరాపో! నా కంటి క్కనిపించకుండ పో!'' అని అంటూ తల దబదబా బాదుకున్నాడు.

ఎదుట పడ్డ మనిషి ఎదురు చూడనట్టుగా మాతి పలగొట్టినట్లయింది.

అసలే బాధ పడుతున్న కడుపులో చెయ్యేసి దేవినట్లయింది. తన రంగి చావుకు తాను కారకుడా? 'శివశివా!' అంటూ రెండు చెవులు మూసుకున్నాడు.

వంచిన తలను పైకెత్తకుండా గిరుక్కున వెనక్కు తిరిగి 'అవును! నా రంగిని నేనే పొట్టన పెట్టు కున్నాను—నేనే పొట్టన పెట్టుకున్నాను!'' అని గొణుక్కుంటూ, గొణుక్కుంటూ ఏడుస్తూ పిచ్చి వాడిలా వీధి వెంట పరుగెడుతున్నాడు.

చెంగమునాయుడు ఇంటి దగ్గర చేరిన వాళ్ళలో చెంగమ్మవ్వకూడా ఉంది. ఆమె కడుపులో అగ్గి పోసినట్లుంది. ఆ మంట ఆరేదీ తీరేదీ కాదు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నా ఆమె కండ్లు నర్సిమ్ములు కోసం గాలిస్తూనే ఉన్నాయి. నర్సిమ్ములుకు వాకిట్లో జరిగిన మర్యాదల్ని గమనించింది. చల్లగా అక్కడనుండి జారుకుంది. ఈ ఇంటి సందు ఆ ఇంటి సందులగుండా నడక పరుగ్గా అడ్డదారి మీద పడి నర్సిమ్ముల్ని అటకాయించింది.

''నాయనా! నర్సిమ్ములూ!'' ఆప్యాయంగా పిలిచింది చెంగమ్మవ్వ.

ఆ పిలుపు నర్సిమ్ముల్ని ఒక్క క్షణం నిలబెట్ట గలిగింది.

''అది కాదు, నాయనా! ఆ అమ్మని మిసినుబాయి కాడికి రమ్మని నువ్వే దుండి పోలివి, నాయనా?''

''మిసినుబాయి కాడికా?'' రెట్టించినాడు నర్సిమ్ములు.

''కాకుంటే ఇంకేడికి, నాయనా? నేనే గద, నాయనా, నువ్వు రాసి పంపించిన సీటీ రెడ్డి కొడుకు దగ్గర సదివించుకో నొచ్చింది.''

''ఆఁ!'' అంటూ అదిరి పడినాడు నర్సిమ్ములు.

అంతే! అతని కండ్ల ముందు అంతా ఒక్కసారి


లిటిల్స్ పోలీకార్బ్ ఫీడింగ్ బాటిల్‌తో మీపాప జీవితానికి ఆరోగ్యవంతమైన ఆరంభం చెయ్యండి

- లిటిల్స్ మరింతగా శుభ్రత గలది, ఎందుకంటే దీన్ని, మరిగే నీటిలో స్టెరిలైజ్ చెయ్యవచ్చు గనక.
- దిగుమతి చేయబడిన, విరగని, కారని పోలికార్బనేట్‌తో చేయబడినది.
- రెండు సైజుల్లో దొరుకుతుంది—స్పెషల్-వాల్వ్-ఏక్షన్ నిపుల్స్ గల మినీ పోలీ మరియు రెగ్యులర్.
- ఉచితంగా లభించే టంబ్లర్ మరియు సిప్పర్‌తో బాటు మీరు ఒకే దాన్లో మూడు కొనుక్కోండిక.




లిటిల్స్ పోలీకార్బ్ ప్రపంచంలోకల్లా సర్వోత్తమమైన వాటిలాగ ఉత్తమమైనది.

ULKA-L-1-83 TEL

గిర్రున తిరిగింది. ''నేను చెరువు కట్టకింద చింత మాను కాకికేరమ్మంటే, ఆయుదవ కర్నం కోడుకేమి రాసినాడో ఏవో? వాడు రాసిందాన్ని ఈ ఎదవ రెడ్డి కోడు కిట్లా సదివి సెప్పినాడు. అప్పటికి ఈళ్ళు కడుపుల్లో ఏవో పెట్టుకున్నారన్న మాట. అట్లా పెట్టుకునే ఈడు మిసినుబాయి కాడ కాపు కాసినాడు. నా రంగిని దోసుకున్నాడు. అందుకే నా రంగి బటుకు సెరువు పాలయింది. అదా సంగతి?

పండ్లు పటపట కొరికినాడు. అక్కడినుండి పరుగందుకున్నాడు. ఇల్లు చేరినాడు. చూరులో చెక్కి ఉన్న మచ్చుకత్తి చేతి కందుకున్నాడు. అదే పరుగు మీద రెడ్డింట్లో దూరినాడు.

రంగి చెరువులో దూకి చస్తుందని వూహించని రెడ్డి కోడుకు రానున్న పరిణామాల్ని వూహిస్తూ వరండాలో పచార్లు చేస్తున్నాడు. ఒక్క లగువులో వాడి మీదికి దూకినాడు. ఒకే ఒక్క వేటుతో తల తెగనరికినాడు. ఎడమచేతిలో తల. కుడిచేతిలో మచ్చు కత్తి! వీరావేశంతో వూరి మీల గుండా నడుస్తుంటే నర్సిమ్ముల మీద ఈగ వాలుంటే ఒట్టు. అదే నడకతో చెరువు కట్ట దాటినాడు. అదే ఆవేశంతో పక్కన పట్నాన పోలీసు స్టేషన్‌లో దూరినాడు. తనకు జరిగిన అన్యాయాన్ని తాను చేసిన ప్రతీకారాన్ని తనకు తానుగా చెప్పుకున్నాడు.

పోలీసులు కేసు పెట్టినారు. ఆ కేసును న్యాయస్థానాలు విచారించాయి. నర్సిమ్ములకు ఏడేండ్ల కఠిన శిక్ష పడింది.

ఏడేండ్లు కఠిన శిక్షను అనుభవించిన నర్సిమ్ములు మళ్ళీ స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. వస్తూ వస్తూ ఆ చెరువు కట్టమీద కూర్చున్నాడు.

అయితే ఆ నాటి నర్సిమ్ములు వేరు, ఈ నాటి నర్సిమ్ములు వేరు.

ఆ నాటి నర్సిమ్ముల్లో నరుడు లేడు. సింహం మాత్రమే ఉంది.

ఈ నాటి నర్సిమ్ముల్లో సింహం లేదు. నరుడు మాత్రమే ఉన్నాడు.

నరుడుగా మిగిలిన నర్సిమ్ములు మహాతత్త్వవేత్తలా నవ్వుతున్నాడు.

జైలు నుండి బయట పడగానే తన రంగి తనకు దూరం కావడానికి కారకుల్లో ఇంకొకడు కర్నం కొడుకు! వాడికి ముందుగా సాగనంపాలనుకున్నాడు. అయితె ఇప్పుడు నర్సిమ్ములు చదువుకున్నవాడు. కేవలం అక్షరాల్ని మాత్రమే కాదు. లోకాన్ని! ఒక్క సంవత్సరం రెండు సంవత్సరాలు కాదు. ఏడు సంవత్సరాలు.

ఇప్పుడు నర్సిమ్ములు జ్ఞాని!

అందుకే చెరువు కట్టమీద చెట్టు మరుగులో లోకజ్ఞానిలా ఆలోచిస్తున్నాడు.

విఫలమైన ప్రేమ మనిషిలో విద్వేషాగ్నిరగిలిస్తుంది కసిని పెంచుతుంది. ఆ కసి బతుకుల్ని మసి చేస్తుంది. కానీనిజమైన ప్రేమ కోరేదేమిటి? ద్వేషమా? పగనా? కసినా? పంతాన్నా? త్యాగమ్నా? కాదు. దేన్ని కాదు. మరి దేన్ని? తన లాంటి బతుకు ఇతరులకు రాకూడదని! అయినా వచ్చింది. ఎందుకు వచ్చింది?

నాలుగు అక్షరాలు కలిపి రాసే యోగ్యత తనకు ఆ అక్షరాల్ని కూడి కూడి చదివే తెలివి రంగికి ఉండి ఉంటే ఇన్ని అనర్థాలు జరిగేవికావు. రాత నేర్చి ఉంటే తమరాత ఇలా ఉండేవి కాదేమో. జరిగిందేదో జరిగింది! ఇక ఇలా జరగడానికి వీల్లేదు. ఈ వూర్లో ఎవ్వరూ ఇంత వంగిలా బలి కావడనికి వీల్లేదు.

అంతేనా? కాదు. వూరి పెద్దలు లాంఛీ పడి అమాయకులైన గ్రామీణులతో ఆడుతున్న ఆట లెన్ని? తప్పుడు వేలిముద్రలతో నెత్తిన రుద్దుతున్న బాకీ లెన్ని? ఈ పగటి దోపిడీలు అంతం కావాలంటే అవసరం అక్షరజ్ఞానం. ఆ జ్ఞానం ఒకరి సొత్తు కాకూడదు. అది ఈ పల్లెలో అందరి సొత్తు కావాలి. రంగి పై తన ప్రేమ కోరుతున్న దదే. అప్పుడే రంగి ఆత్మ శాంతిస్తుంది కూడా.

నర్సిమ్ములు ఇట్లా ఆలోచిస్తూ ఉంటే, వూళ్ళో గుళ్ళో దేవుడి పూజ జరుగుతూందేమో? గణగణ గంట మోగుతూంది. ఆ తొలి జాము తొలి వేళ నిమ్మళంగా ఉండే గుడిగంటల శబ్దం చెవుల్లో కొట్టనట్లు వినిపిస్తూ ఉంది.

''గుడి గంట కాదు నే ను వినవలసింది. ఇక మీదట బడిగంటలుకూడ !'' అనుకుంటూ కృత నిశ్చయంతో పైకి లేచినాడు నర్సిమ్ములు!

అతని నిర్ణయానికి మరింత బలం సమకూర్చ దాని కన్నట్లుగా గుడి గంటలు ఇంకా మోగుతూనే ఉన్నాయి!

*

TP.G.30 TE



"కర్కశంగా, గరుకుగాఉండే
పళ్ళపొడులు మీ పళ్ళకు,
చిగుళ్ళకు
హానికలిగించవచ్చు..."

కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను, చెడుశ్వాసను కూడా అరికట్టండి, పళ్ళను కాపాడుకోండి.

కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్. అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది.

మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పర్‌మెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు..

